క్లుప్తంగా

మురుగు నిలిచి.. దుర్గంధం వ్యాపించి



ఇళ్ల మధ్యన నిలిచిన మురుగునీరు, అందులో ఉన్న బోర్‌మోటార్

కేశంపేట: మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామ శివారులోని తెట్టేకుంటతండాలో మురుగునీరు ఇళ్ల మధ్యలో చేరి దుర్వాసన వస్తోంది. దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. మురుగునీరు నిలిచే ప్రదేశంలోనే గ్రామ పంచాయతీకి సంబంధించిన బోర్ కూడా ఉంది. మురుగునీరు బోర్‌లోకి వెళ్లే ప్రమాదం ఉందని, ఆ నీటినే తాగుతున్నామని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇళ్ల మధ్యలోనే మురుగునీరు నిలవడంతో దుర్గంధంతో పాటు దోమబెడద పెరుగుతోందని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి మురుగునీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని తండావాసులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమి పరిశీలన

నందిగామ: మండల కేంద్రమైన నందిగామలోని రైల్వే ట్రాక్ పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జిల్లా ఉన్నత పాఠశాలలు ఒకే ఆవరణలో ఉన్నందున ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఇటీవల పాఠశాలలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు తన దృష్టికి తెచ్చారని గుర్తుచేశారు. ప్రాథమిక పాఠశాలను వేరోక చోట నిర్మించాలని సంకల్పించామని, అందులో భాగంగానే రైల్వే ట్రాక్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. పాఠశాలకు అనుకూలమైన స్థలాలు ఇంకా ఎక్కడ ఎక్కడ ఉన్నాయో చూసి స్థలాన్ని ఎంపిక చేస్తామని వివరించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింహయాదవ్, మాజీ ఎంపీటీసీలు దేపల్లి కుమార్‌గౌడ్, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

సీఐ భూపాల్‌శ్రీధర్




నాయకులతో మాట్లాడుతున్న సీఐ భూపాల్‌శ్రీధర్

చేవెళ్ల: ప్రజలు అన్ని పండుగలను కులమతాలకతీతంగా శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ భూపాల్‌శ్రీధర్ అన్నారు. చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం అన్ని పార్టీల నాయకులతో బక్రీద్ పండుగ సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా వాహనాల్లో పశువులను తరలించటం నేరమన్నారు. దీనిపై అన్ని ప్రధాన కేంద్రాల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. బక్రీద్ పండుగను కులమతాలకతీతంగా అంతా కలిసిమెలసి జరుపుకోవాలని సూచించారు. అన్ని వర్గాల ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఎక్కడైనా ఎవరైనా పశువులను అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు సంతోష్‌రెడ్డి, శిరీష, మండలంలోని ఆయా పార్టీల నాయకులు, గోరక్షక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి

మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్



పూజా కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్ అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ గోదా రంగనాయకస్వామి దేవాలయంలో రవీందర్‌యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటే ఏకాగ్రత లభిస్తుందన్నారు. రంగనాయకస్వామి ఆలయాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు కేశవాచార్యులు, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నట్‌రాజన్, నాయకులు రాజేశ్‌పటేల్, కృష్ణ, రాము, బాల్‌రాజ్, శ్రీను, నరేశ్, అశోక్, నవీన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా నివాసాలు

- నిర్వహణ లేక శిథిలావస్థకు చేరిన వైద్య సిబ్బంది క్వార్టర్స్
- మరమ్మతులు చేయించాలని స్థానిక ప్రజల వినతి
- పట్టించుకోని సంబంధిత అధికారులు



మొయినాబాద్ పీహెచ్‌సీ ఆవరణలో వృథాగా ఉన్న సిబ్బంది క్వార్టర్స్

మొయినాబాద్: రోగులకు 24 గంటలపాటు అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలోనే నిర్మించిన వైద్య సిబ్బంది క్వార్టర్స్ శిథిలావస్థకు చేరాయి. ఇరవై సంవత్సరాల క్రితం నిర్మించిన భవనాలు అప్పటి నుంచి నిరుపయోగంగానే ఉన్నాయి. దీంతో ప్రస్తుతం కూలిపోయే దుస్థితికి చేరాయి.

ఇరవై ఏళ్ల క్రితం..

మొయినాబాద్ మున్సిపాలిటీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే సిబ్బంది అక్కడే ఉండటం కోసం ఇరవై ఏళ్ల క్రితం ఐదు క్వార్టర్స్ నిర్మించారు. అప్పట్లో వాటిలో ఉండడానికి అన్ని వసతులు కల్పించారు. కానీ సిబ్బంది ఎవరూ వాటిలో ఉండకపోవడంతో నిరుపయోగంగా మారాయి. వైద్యాధికారులు, సిబ్బంది కనీసం వాటి నిర్వహణను కూడా పట్టించుకోకపోవడంతో అవి పూర్తిగా శిథిలావస్థకు చేరాయి.

ఒకదానికి మరమ్మతులు చేసి..

ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్న సిబ్బంది క్వార్టర్స్‌ను ఏడేళ్ల క్రితం అప్పటి జిల్లా కలెక్టర్ వాణీప్రసాద్ సందర్శించారు. ఒక భవనానికి మరమ్మతులు చేసి గర్భిణుల నిరీక్షణకు వినియోగించాలని నిధులు మంజూరు చేశారు. దీంతో ఒకదానికి మరమ్మతులు చేసి లేబర్ రూమ్‌గా వినియోగంలోకి తీసుకొచ్చారు. మరో క్వార్టర్స్ భవనంలో నాలుగేళ్ల క్రితం వరకు ఆయుర్వేద ఆస్పత్రి కొనసాగింది. అది కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఆస్పత్రిని కూడా అందులో నుంచి తీసివేశారు.

మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం

మొయినాబాద్‌లో మిషన్ భగీరథ నీటి సరఫరా కోసం పీహెచ్‌సీ ఆవరణలో ఉన్న ఒక సిబ్బంది క్వార్టర్స్‌ను కూల్చివేసి రెండు వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం చేపట్టారు. ఇక మిగిలిన రెండు క్వార్టర్స్ భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. ఆ రెండు భవనాలకైనా మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొస్తే వైద్య సిబ్బంది ఉండేందుకు ఉపయోగపడతాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఉండేందుకు క్వార్టర్స్ లేవనే నెపంతో వైద్య సిబ్బంది నగరం నుంచి రాకపోకలు సాగిస్తూ సమయపాలన పాటించకుండా ఇష్టం వచ్చినప్పుడు వస్తున్నారని ఆరోపిస్తున్నారు.

బీఆర్‌ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో చేసిన అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీలో ఆదివారం ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన, విద్యుత్ తీగల తొలగింపుపై నిర్వహించిన కృతజ్ఞత సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో అర్హులుగా ఉన్న ప్రతీ ఒక్కరికి తప్పకుండా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేవలం మాటలు, ప్రచారాలతోనే పాలన సాగించినట్లు విమర్శించారు. చేతనైతే అభివృద్ధి పనులు చేయండి లేదా చేసేవారికి సహకరించండి అంతే తప్పా అభివృద్ధిని అడ్డుకోవద్దన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మొదటి నుంచి ప్రజా సమస్యల సాధనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా తప్పకుండా ఇచ్చిన హామీలను అమలు చేస్తామన్నారు.

తీగల తొలగింపు కాంగ్రెస్‌దే..

గత పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నేతలకు మున్సిపాలిటీలోని ఆరో వార్డులో పలు ఇళ్లపై నుంచి వెళ్లిన విద్యుత్ హైటెన్షన్ తీగలను తొలగించడానికి చేతకాలేదని విమర్శించారు. సమస్య పరిష్కారం చేస్తామని పలువురిని పార్టీలో చేర్చుకున్నట్లు ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఆరో వార్డు కౌన్సిలర్ వీరమోని హేమాదేవేందర్ కాలనీవాసుల సమస్యను తనకు తెలపడంతో వెంటనే తీగలను తొలగించినట్లు వివరించారు. కాగా పనులు తామే చేసినట్లు బీఆర్‌ఎస్ నేతలు ప్రకటించుకోవడం సిగ్గుచేటన్నారు. కొత్తూరు మున్సిపాలిటీ అభివృద్ధికి బీఆర్‌ఎస్ నేతలు సహకరించని పక్షంలో పాలనపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తామన్నారు. బీఆర్‌ఎస్ విమర్శలకు కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి పనులే సమాధానమన్నారు. గత పాలకులు స్వార్థ ప్రయోజనాల కోసం కొత్తూరును మున్సిపాలిటీగా చేసినట్లు వివరించారు. ఏది ఏమైనా కొత్తూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ మున్సిపాలిటీగా మార్చడానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్‌గౌడ్, వీరమోని దేవేందర్‌ముదిరాజ్, శ్రీనివాస్, సురేందర్, హరినాథ్‌రెడ్డి, నర్సింహ, మహేశ్, బాల్‌రాజ్‌గౌడ్, బాబర్‌ఖాన్, నవీన్‌చారి, విజయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుడికి మంజూరుపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

బీసీలందరూ ఏకతాటిపైకి రావాలి

జీసీ సేన మండల అధ్యక్షుడు మేకల వెంకటేశ్



నియామకపత్రాలు అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: హక్కుల సాధనకు బీసీలందరూ ఏకతాటిపైకి రావాలని బీసీ సేన ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు మేకల వెంకటేశ్ అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండలం కాశిరెడ్డిగూడ గ్రామంలో బీసీ సేన నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా బీసీల జీవన విధానంలో మార్పు రావడం లేదని ఆరోపించారు. ఏ ప్రభుత్వాలు బీసీల అభివృద్ధికి కృషి చేయడం లేదన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు పదవులు సాధించాలన్నారు. ఇందుకుగాను గ్రామాల్లో బీసీలందరూ ఐక్యంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా బీసీ సేన కమిటీ అధ్యక్షుడిగా బోయ శేఖర్, ఉపాధ్యక్షుడిగా మంగలి తరుణ్, ప్రధాన కార్యదర్శిగా శివ, కోశాధికారిగా నందరాజుగౌడ్, సలహాదారులుగా కృష్ణయ్య, రామలింగం, అదేవిధంగా మహిళా కమిటీ అధ్యక్షురాలిగా కూచూరి అనురాధ, ఉపాధ్యక్షుడిగా నర్సమ్మ, ప్రధాన కార్యదర్శిగా అలివేలు, కార్యదర్శిగా చాకలి చిట్టిని ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖరప్ప, జక్కల జలజ, నర్సింలు, సస్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఉత్సవాలకు విరాళం



ఆలయ అర్చకుడికి విరాళం అందిస్తున్న దాతలు

చేవెళ్ల: భక్తిభావాన్ని అలవర్చుకోవాలని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకుడు వెంకటనాదాచార్యులు అన్నారు. మండలంలోని తంగడపల్లి గ్రామంలోని శ్రీదశావతార సహిత శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి రాజగోపుర కలశ ప్రతిష్ఠ ఏర్పాట్లకు గ్రామానికి చెందిన దాతలు జనార్థన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ ఒక్కొక్కరూ రూ.50వేల చొప్పున లక్ష రూపాయలను ఆదివారం ఆలయ అర్చకుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 29 నుంచి వచ్చేనెల 3వ తేదీవరకు బ్రహ్మోత్సవాలు, రాజగోపుర కలశ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరగనున్నట్లు తెలిపారు. ఆరురోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు కల్యాణోత్సవం, రథోత్సవం, దోపోత్సవం, చక్రతీర్థం, పుష్పయాగం తదితర కార్యక్రమాలు ప్రత్యేక పూజలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

'సైనికులను అవమానించడం బాధాకరం'

మొయినాబాద్‌రూరల్: సైనికులను అవమానించడం బాధాకరమని బీజేపీ ఓబీసీ సెల్ జిల్లా కన్వీనర్ ఎలగని వెంకటేశ్‌గౌడ్ అన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్ చౌరస్తాలో ఆయన ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. భారత సైనికులను అవమానపరిచేలా కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం సరికాదన్నారు. దేశ సమగ్రతలను నిలబెట్టే సైనికుల గురించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖార్గే ఇతర నాయకులు అవమానించేలా హేళన చేస్తూ మాట్లాడడం బాధాకరమన్నారు. దేశాన్ని రక్షించుకునేందుకు పార్టీలు ముఖ్యం కాదని అందరూ ఐకమత్యంగా ఉన్నప్పుడే సైనికులకు ధైర్యం నింపగలుగుతామన్నారు. ఇకనైనా దేశ రక్షణలో ఉన్న వారిపై ఎవరు విమర్శలు చేయొద్దని కోరారు.

పేదల సొంతింటి కల సాకారం

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి

షాద్‌నగర్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో ఇళ్లు లేని నిరుపేదల కల సాకారం అవుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఇళ్ల లబ్ధిదారులకు శ్రీకాంత్‌రెడ్డి మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలను ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. అర్హులందరికీ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందని వెల్లడించారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఆహర్నిషలు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అర్జున్, నాయకులు సురేష్‌గౌడ్, హరికృష్ణయాదవ్, సాయికుమార్, రమేశ్‌గౌడ్, మల్లేశ్ యాదవ్, అశోక్, గోదా రమేశ్, మాధవి, సునీత, గణేష్, శ్రీధర్‌గౌడ్, మల్లేశ్, శంకరయ్య, రవిచారి, మల్లేశ్‌గౌడ్, గణేష్, సిద్ధి రవితేజ, శ్రీధర్, ప్రతాప్‌రెడ్డి, దాదిమియా, రాంచంద్రయ్య, బుచ్చయ్య, బక్కని శ్రీను, నర్సింలు, రాజు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న నాయకులు

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

షాబాద్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తమవంతు కృషిచేస్తామని మద్దూరు మాజీ సర్పంచ్ పట్లోళ్ల నరేందర్‌రెడ్డి, మాజీ సహకార సంఘం డైరెక్టర్ రాంరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మద్దూరులో దివంగత నేత పట్లోళ్ల లక్ష్మారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు గత 15 రోజులుగా ఎంపీఎస్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి హైదరాబాద్ సన్‌రైజర్ జట్టుకు రూ.1 లక్ష నగదు, రెండో బహుమతి ముంబాయి జట్టుకు రూ.25వేల నగదు, మెమొంటోలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడూతూ.. క్రీడలతో మానసిక ఉల్లాసం, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. కృషి పట్టుదల, క్రమశిక్షణ ఉంటేనే విజయాలు వరిస్తాయన్నారు. ఓటమి, గెలుపునకు నాంది కావాలన్నారు. కార్యక్రమంలో కుమారులు శ్రీనివాస్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, అంజిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రవినాయక్, నాయకులు సుధాకర్‌గౌడ్, బాల్‌రాజ్‌యాదవ్, విగ్నేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



గెలుపొందిన క్రీడాకారులకు చెక్కులు అందజేస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

మన్‌కీ బాత్ వీక్షించిన బీజేపీ నేతలు

షాద్‌నగర్: ప్రధాని మోదీ ఆదివారం నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని పట్టణంలో బీజేపీ నేతలు టీవీల్లో వీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ప్రసంగంలో పలు జాతీయ ప్రాధాన్యత గల అంశాలను వివరించారు. వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర, డ్రోన్ సాంకేతికతను వాడుతూ మహిళలు వ్యవసాయం చేయడాన్ని వివరించారు. అదేవిధంగా ఆపరేషన్ సిందూర్‌లో మేడిన్ ఇండియా సాంకేతిక విజయం, రాజకీయాల్లో మహిళల పాత్రపై ప్రధాని మన్‌కీ బాత్‌లో ప్రస్తావించారు. ప్రధాని ప్రసంగాన్ని బీజేపీ నేతలు అత్యంతం ఆసక్తిగా తిలకించారు. అదేవిధంగా మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తాతో పాటుగా పలువురు నాయకులు మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, నాయకులు హరిభూషణ్, మురళీ, నర్సింలు, కుర్మయ్య, ప్రశాంత్, మనోహర్, అంజయ్యగౌడ్, గిరి, శివ, ఆనంద్, మహేశ్, బాబు పాల్గొన్నారు.

చేవెళ్లలో..

చేవెళ్ల: ప్రధాని మోదీ నేరుగా ప్రజలతో మాట్లాడేందుకు ఏర్పాటు చేసిన మన్‌కీబాత్ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, యువ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి అన్నారు. చేవెళ్లలో ఆదివారం ప్రధాని మోదీ 122వ మన్‌కీ బాత్ ప్రోగ్రామ్‌ను స్థానిక బీజేపీ నాయకులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాని నేరుగా ప్రజలతో ప్రజల సమస్యలను తెలుసుకోవటం గొప్ప విషయమన్నారు. అలాంటి నాయకుడు మనకు ఉండటం అదృష్టమన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.



షాద్‌నగర్: ప్రధాని మోదీ ప్రసంగాన్ని టీవీలో చూస్తున్న నాయకులు

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి సతీమణి కవితారెడ్డి



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న కవితారెడ్డి, మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి

షాబాద్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి సతీమణి కవితారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని అస్పల్లిగూడ గ్రామంలో నిర్వహించిన బీరప్ప ఉత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవాలకుగాను రూ.51వేల విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మొయినాబాద్: మండల పరిధిలోని వెంకటాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సురంగల్‌లోని ఓ ఫాంహౌస్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అందరూ ఒక్కచోట చేరి చదువుకునే రోజులను గుర్తుచేసుకున్నారు. నాటి జ్ఞాపకాలు, తీపి గుర్తులను నెమరువేసుకొని ఉత్సాహంగా గడిపారు. నాడు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు రాంచంద్రారెడ్డి, రాఘవేందర్, వెంకట్‌రెడ్డి, మహిపాల్, శ్రీశైలం, మాధవి, హరిప్రియ, నర్సింహ, శ్రీశైలం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రోడ్డు ఇలా.. వెళ్లేదెలా?

- మట్టిరోడ్డుపై చేరిన వర్షపునీరు
- రాకపోకలకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు



బురదమయంగా గొపులాయతండా రోడ్డు

కేశంపేట: రోడ్డు నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మట్టిరోడ్డుపై నీరు నిలవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామ శివారులో ఉన్న గొపులాయతండాకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీటీరోడ్డును మంజూరు చేసింది. దీంతో అప్పటి ప్రజాప్రతినిధులు పనులకు శంకుస్థాపన చేశారు. కానీ రెండేళ్లయినా కిలో మీటర్‌లోపు రోడ్డు పనులు పూర్తి కావడం లేదు. దీంతో స్థానిక ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి బీటీరోడ్డు పనులు పూర్తి చేసి తమ ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.

అర్ధంతరంగా ఆగిన పనులు

పంచాయతీరాజ్ రోడ్డు నుంచి గొపులాయతండా వరకు కిలోమీటర్‌లోపు దూరం ఉంటుంది. ఎస్‌డీఎఫ్ నిధుల్లో నుంచి రూ.80 లక్షల వ్యయంతో రోడ్డుపైన కల్వర్టులతో పాటుగా బీటీరోడ్డు వేసేందుకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. గత ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణానికి అప్పటి ప్రజాప్రతినిధులు 2023లో శంకుస్థాపన చేశారు. రోడ్డు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ రెండు కల్వర్టులను పూర్తి చేసి, రోడ్డుకు ఇరువైపులా మట్టిని పోశాడు. బీటీ రోడ్డు వేయకుండా అర్ధంతరంగా పనులు నిలిపివేయడంతో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపైన నీరు చేరింది. దీంతో వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పనులను త్వరగా పూర్తిచేసి తమ ఇబ్బందులను తీర్చాలని కోరుతున్నారు.

బీటీరోడ్డు వేయాలి



రోడ్డు పనులను కాంట్రాక్టర్ త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి. మట్టిరోడ్డుపై వర్షపు నీరు నిలవడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి బీటీరోడ్డు పనులు పూర్తి అయ్యే విధంగా చూడాలి.

–రాజునాయక్, గొపులాయతండా, బైర్కాన్‌పల్లి గ్రామం